# తుంగభద్ర

★

## శ్రీ సాళ్వ కృష్ణమూర్తి

ఉమామహేశ్వరంలో చిత్రమైన మార్పేదో కనిపించింది నాకు. కాని పైకి అది కొద్దిపాటి క్రొత్తదనాన్ని మాత్రమే సూచించే, సన్నని తీగవంటి మార్పు. అది మెఱుపువలె అప్పుడప్పుడు కనిపిస్తుంది. మంచు బిందువులోను, చిగురుటాకులోను, లేడికళ్ళలోను, సెలయేటి నీళ్ళలోను కనిపించే మెఱుగది. ఒకక్షణంకంటె యెక్కువ మన స్వాధీనంలో నిలువదు. అదెక్కడ వున్నదో మనము నిర్దేశించి చెప్పలేము. ఒక దృక్కోణంలోనుంచి చూచినప్పుడు మాత్రమే ఆ మెఱుగు చట్టున ప్రత్యక్షమౌతుంది. మనదృష్టి కాస్త చెదరిందా అది వెంటనే అదృశ్యమౌతుంది. కాని ప్రతిసారీ అదేకోణంలోంచి చూడడం సాధ్యపడదు. అయినా అది యాదృచ్ఛికంగా జరుగవలసిందే. ఆయాదృచ్ఛికతను సంభవింప జెయ్యడానికై ప్రయత్నించగా ప్రయత్నించగా ఉమామహేశ్వరం ముఖంలోని ఆ మెఱుగుకు కావలసిన దృక్కోణం అంతు దొరికింది. దాన్ని చూడవలెనంటె అతడు ప్రతిమనిషినీ, వస్తువునూ చట్టున చూచినప్పుడే మన మతన్ని చూడాలి. క్షణం గడిస్తే మన కది దొఱుకదు. ఆ మెఱుగులో—అత డేలోకాన్నుంచో యీలోకంలోకి వచ్చిపడినట్లు, తాను చూస్తున్న ప్రతివస్తువుని, మనిషినీ తానప్పుడే జీవితంలో మొట్టమొదటిసారిగ చూస్తూన్నట్టు కనిపిస్తుంది. రేఖామాత్రమైన భయం కాని భయముకూడా కనిపించకపోదు. అది నా దృష్టిపథంలో కెట్లా వచ్చిందో నాకే తెలియదు. అయినా దాని స్వరూప మేమిటో మఱింత విస్పష్టంగా తెలిస్తే బాగుండును! అమార్పు, — ఆ మెఱుగు, ఆ కళ్ళలో ఒక క్షణకాలంమాత్రం నిలచి అదృశ్యమయ్యే ఆ వెన్నెల రేక ఎక్కడ కలిగిందో?

'ఏమి టాలోచిస్తున్నావ్?' టవల్‌తో ముఖం తుడుచుకుంటూవచ్చి అడిగినాడు శేఖరం.

'ఏమీ లేదు—' అన్నాను.

'—ఉమామహేశ్వరాన్ని గురించి' క్షణం ఆగి నేనే అన్నాను.

నా ముఖంలోకి చూచి చిఱునవ్వు నవ్వి కుర్చీలో కూర్చుంటూ శేఖరం ఏదో చెప్పబోయినాడు.

నే నతనిమాటకు ఎదురు చూస్తూ కూర్చున్నాను. శేఖరం ఏమీ పలకలేదు. ఆలోచనలో పడినాడు.

ఐదునిముషాలు గడిచినవి. శేఖరం భార్య కామేశ్వరి కాఫీ పట్టుకవచ్చి మా మధ్యవున్న టేబుల్ మీదపెట్టి కూర్చున్నది. ఇంతలో 'బాబు' వచ్చి కామేశ్వరిఒళ్లో కూర్చున్నాడు.

శేఖరం కాఫీ కలుపుతూ, మెల్లగా '—చిత్రమైనవాడే' అన్నాడు.

కామేశ్వరి మా యిద్దరి ముఖాలవైపు సాభిప్రాయంగా చూచింది.

'ఉమామహేశ్వరం', శేఖరం భార్యనుచూస్తూ అన్నాడు.

ఆమె మాట్లాడకుండా తలవంచుకుని కూర్చొని 'బాబు'కు కాఫీ తాపుతున్నది. ఆమెగూడ ఆలోచిస్తున్నదేమో!

శేఖరం నాకు కాఫీయిచ్చి తాను త్రాగుతూ—

'నీకు ఇంద్రాణిమీద ప్రాణం — ఉమామహేశ్వరంమీద కోపం.' ఎవరినీ చూడకుండా నే అన్నాడు.

'నాకేమీ కోపంలేదు.' కామేశ్వరి చిన్నగా నవ్వి అన్నది.

శేఖరం నన్ను చూస్తూ—

'పోయినసారి నీవు వచ్చినప్పుడు వాళ్లతో పరిచయంచేసినప్పటినుండీ ఇంద్రాణి స్నేహితురాలైంది. వీళ్ళిద్దరికి ఒకరంటే మఱొకరికి ప్రాణం. ఉమామహేశ్వరంమీద మాత్రం కొన్నాళ్ళనుంచి కోపం' అన్నాడు.

ఎందువల్లనని నే నడుగలేదు.

'రెండుపక్షాలూ చూడలేని వాళ్లకి అట్లానే ఉంటుంది' కామేశ్వరి ఆమాట అని తలెత్తిచూచి, తల వంచుకున్నది.

'నిజమంతే.' శేఖరం కాఫీ గ్లాసు టేబుల్ మీద పెడుతూ అన్నాడు—

'అయితే అతనెందుకు ఒప్పుకోలేదు?' ఆమె ఈసారి నన్ను కూడా చూస్తూ అడిగింది. సమాధానం చెప్పవలసిన బాధ్యత నాకూ అంటగట్టినట్టు అర్థమయింది.

'అతను ఒప్పుకోక 'కాద'ని కూడ అనలేదు గదా!......అయినా కారణం తెలియాలి. ఇవాళే జరగాలంటే యెట్లా?'

నాకు విషయం కొంత ఊహ కందింది. కాని పూర్తిగ బోధపడలేదు.

'సంవత్సరమైంది. దాని ప్రాణమంతా అతని మీదే వున్నది'

ఆమె గ్లాసులు తీసుకొని లోపలికి వెళ్ళింది. 'బాబు' వాళ్ళ నాన్నదగ్గరకు వచ్చి ఆ కుర్చీలోకి యెక్కేందుకు ప్రయత్నిస్తున్నాడు. చివరకు సాధ్యం కాక రెండుచేతులూ చాపి 'నాన్నా—'అని రాగం తీసినాడు. శేఖరం వాడిని తన వొళ్లోకి తీసుకొంటుంటే వాడిచేతిలో బొమ్మ కాగితం క్రింద పడింది. వాడది కావాలన్నాడు — శేఖరం దాన్ని తీసియిచ్చినాడు. వాడు దాన్ని అన్నికోణాల్లోంచి చూస్తూ మురిసిపోతూ అందులో మగ్నుడై పోయినాడు.

'ఉమామహేశ్వరం యెక్కడెక్కడో తిరిగి వచ్చినాక ఈ విషయం పుట్టింది. సంవత్సరనించే ఎందుచేతనో అతడు 'సరే'ననలేదు. కాదనీ అనలేదు ......మళ్ళీ పంతులుగారన్నా, ఇంద్రాణి అన్నా అభిమానమే. వాళ్లని వదలడు...ఎప్పుడూ వీణ; ఏకాంతంగా కూర్చొని వాయించుకోవడమో లేదా పాఠాలు చెప్పిరావడమో. ఇంతే. ... ఆ తిరిగి వచ్చినప్పటి నుండీ కొంత మార్పువచ్చిం దాతనిలో—' ఏదో జ్ఞాపకం చేసుకుంటున్నవాడివలె శేఖరం ఇవన్నీ నాకు తెలుసునన్నట్లుగా నే చెప్పకపోయినాడు.

'ఎక్కడికెళ్లివచ్చినాడు?' కొంచెం ఆగి నేనే అడిగినాను.

శేఖరం ఒకక్షణం ఆలోచించి నా ముఖంలోకి చూచి అన్నాడు.

'నీవు వచ్చిపోయి నాలుగేండ్లయిందను కుంటాను. అప్పుడు ఒక నెలరోజులుండి వెళ్ళినా వనుకుంటాను...నీవు వెళ్ళినతర్వాత సంవత్సరానికి అత డీవూరునుండి వెళ్ళిపోయినాడు. ఎక్కడికి వెళ్ళినాడో మాకెవ్వరికీ తెలియదు. వాళ్ళ చిన్నాయనకు మాత్రం భూములూ అవీ చూడమనీ, తిరిగి వస్తానని ఉత్తరం వ్రాసినాడట. తర్వాత సంవత్సరన్నరకు గాని అతని పొలకువ మాకు తెలియలేదు. అప్పటికి అతడు హైదరాబాదులో ఉన్నట్లు పంతులు గారికి తెలిసింది. ఆపైన ఆరునెలలకుగాని అత డిక్కడికి రాలేదు—' శేఖరం ముగించినాడు.

'ఒకటిన్నర సంవత్సరం ఎక్కడికి వెళ్ళినాడో!' అన్నాను ఆలోచిస్తూ—

'బెంగుళూరు, హైదరాబాదుల్లో ఉన్నాడట.'

సమాధానం కుదురలేదు. ఇందులో మనకు తెలియని దెక్కడో వున్నదనిపించింది. ఇంతలో కామేశ్వరి వచ్చింది. శేఖరం తుంగభద్రకు షికారు పోదామన్నాడు. 'సరే' నన్నాను.

## 2

'బాబు', మేము ముగ్గురమూ — ఏటిలోపలికి వెళ్ళి ఒకచోట కూర్చున్నాము. పగలంతా యెండకు కాగినా యిసుక అప్పటికే చల్లబడి సుఖంగా వుంది. చల్లటిగాలి కనిపిస్తూన్న రెండు ఆకాశపుటంచులనూ రాచుకొని వీస్తున్నది. ఆకాశపులోతుల్లోని నీలిమకూ, ప్రకృతి అంతరాంతరాలదాకా చల్లబడడానికి నిగూఢమైన సంబంధమేదో ఉన్నట్లనిపిస్తూంది.

'బాబు' మాకు రెండుమూడు గజాలదూరంలో యిసుక పిడికిళ్ళతో యెత్తిపోస్తూ ఆడుకుంటున్నాడు —కామేశ్వరి మా యిద్దరికి కొస్త దూరంగాకూర్చొని ఏదో ఆలోచనలో పడింది.

శేఖరం కాస్సేపు ఊరకుండి, సన్నగా కంఠాన్ని రాచుకుంటూ మెలికలు తిరిగి వచ్చే సంగీతంతో

"గంగా సంగమ మిచ్చగించునె
        మదిఁ గావేరి దేవేరిగా
నంగీకార మొనర్చునే యమునతో
        నానందముఁ బొందునే
రంగత్తుంగ తరంగహస్తముల
        నా రత్నాకరేంద్రుండు నీ

యుంగంబంటి సుఖించు నేని
గుణభద్రా తుంగభద్రానదీ!"

పద్యం చదివినాడు. మళ్ళీ నిశ్శబ్దం. అందరమూ ధ్యానంలో ఉన్నాము. నేననుకున్నాను.

'శేఖరం ఎందుకో కవిగా పుట్టలేదు. యోగ భ్రష్టునివలె కనిపిస్తాడు.'

'ఉమామహేశ్వరానికీ తుంగభద్ర అంటే ప్రాణం. తుంగభద్రకోసమే ఈ వూరు వచ్చినా నంటాడు' కొన్ని క్షణాలతర్వాత శేఖరం అన్నాడు.

నాలో ఆశ్చర్యపు మొలక ఎక్కడో పొటమరించి నిలచిపోయింది. అతనికి ప్రత్యేకంగా ఈనదిమీద యెందుకిష్టమో నే నూహించదలచుకోలేదు.

'ప్రతివాళ్ళకీ ఒక్కొక్కదానిమీద ఒక ప్రత్యేక కారణాన్ని బట్టి ఆప్తత, అభిమానము, ఆంతర జీవితంతో సంబంధము పెనుచుకొని వస్తవి. నాకూ తుంగభద్రం టే చాల యిష్టం.'

శేఖరానికీ విషయం తెలుసు. కనుబొమలమీద కెగసిన హాసరేఖతో ఎందుకిష్టమో చెప్పమన్నట్టు చూచినాడు.

'ఒకసారి ఎండకాలంలో రాత్రంతా ఉడికిపోయి మసిమసి చీకటిలో తుంగభద్రకు వెళ్ళినాను. ఇంకా బాగా తెల్లవారలేదు. నది మధ్యకు వెళ్ళినాను. చల్లటి తియ్యనిగాలి ఒంటిని మెల్లగా ప్రేమతో సుఖంగా స్పృశిస్తూ పోతూంది. దూరాన అవతలిగట్టున యేదో తోటలోనుంచి రెండు కోయిలలు పందెం వేసుకొని 'కూహూ' మంటున్నవి. ఆ మసిమసిచీకటిలో, చిఱుగాలిలో తుంగభద్ర యింకా సెజ్జవీడని శృంగార నాయికను తలపిస్తున్నది. ఈషత్ నిద్రావశత్వంతో కూడుకొన్న తుంగభద్రకు మసక చీకటి అరమోడ్పు కనులతోడి అందమైన దృష్టిని ఆపాదిస్తున్నది. ఇసుక తెరలు తెరలుగ నిలచి స్పృశిస్తే సౌందర్యం చెడుతుందనేంత అందంగా ఉన్నది.

పల్చగా పారే ఆ జాలులో ఎన్ని నీళ్ళు త్రాగినానని! అగస్త్యునివలె నీళ్ళన్నీ త్రాగివేయాలనిపించింది. తుంగభద్ర అందంతోనే నాకు మత్తు, అశక్తత కలిగినవి.

శేఖరం ఈ కవిత్వమంతా శ్రద్ధగా వింటున్నాడు. కామేశ్వరికూడా వినకపోలేదు. అంతవరకూ 'బాబు' తలమీద యిసుకగుప్పిటతో పోసుకొంటున్న సంగతి ఆమె అప్పుడే గమనించి వాడిదగ్గరికి వెళ్లింది. వాడినిచూచి శేఖరం నవ్వినాడు.

'ఆనాటినుంచీ నాకు తుంగభద్రఅంటే ప్రాణం. నేను తుంగభద్రను జయించాలనుకుంటే అదే నన్ను జయించింది. పెద్ద విశేష మేమీలేకపోయినా ఆంతర జీవితంలో యిట్లా అతుక్కుపోవడం చిత్రంగా లేదూ?' అందుకొని పూర్తిచేసినాను.

కామేశ్వరి 'బాబు' తలలో యిసుకంతా విదల్చి మళ్ళీ కూర్చున్నది. ఎందుకో ఆమె మా ముగ్గురిని చూచి సన్నగా నవ్వింది. ఆమె దృష్టికి మేమూ వాడివలెనే కనిపించినామేమో!

'ఇంద్రాణి కంత ప్రత్యేకాభిమానం లేదు తుంగభద్రమీద.' కామేశ్వరి ఈమాటన్నది.

'కారణం నీకు తెలియాలి' శేఖరం ఆమెను చూస్తూ అన్నాడు. ఆమె మాట్లాడలేదు. సందె చీకటి పడి పల్చగా వెన్నెల కాస్తున్నది. బాబు మిసమిస మెఱిసే రాళ్ళు చేతిలో వ్రేళ్ళసందున పట్టుకొని నాలుగు తెచ్చినాడు.

ఇంటికి నడుస్తున్నాము. ఇసుకలో ఒకచోట అనుకోకుండా ఉమామహేశ్వరం కనిపించినాడు. ఒక్కడే కూర్చున్నాడు. గుర్తుపట్టి దగ్గరికివెళ్ళి నిలబడినాను. నన్ను చూడగానే చకితుడై, ఒకక్షణం వుండి 'మీరా!' అన్నాడు. తర్వాత ఏమీ మాట్లాడలేదు. మాతోకూడా నడిచినాడు. కొంతదూరం వెళ్ళినాక నన్ను తనతో వాళ్లయింటికి రమ్మన్నాడు. 'సరే' నన్నాను.

శేఖరాన్ని, కామేశ్వరినీ ఇంటివద్ద వదలి మేమిద్దరము పంతులుగారింటికి వెళ్ళినాము.

## 3

నడుస్తున్నంతసేపు ఉమామహేశ్వరం ఏమీ మాట్లాడలేదు. మనస్సెక్కడో ఉన్నట్లున్నది. వీధుల్లో జనానికేంతక్కువ? వాళ్ళశబ్దము మా చెవుల్లో దూరలేదు. మధ్యమధ్య ఆ కలకలము నేనున్నానంటూ కొట్టవచ్చినట్లు వినిపించినా దానికంతటికీ వెనుక ఒక గంభీరమైన నిశ్శబ్దత తాండవించినట్లే కనబడింది. అందులో ఒక్తి నిస్సహాయతే! ఆ నిస్సహాయంతంతా ఉమామహేశ్వరం ముఖంలో కనిపించింది నాకు. మూర్తామూర్త ప్రపంచాలమధ్య మా ఆత్మలు నలుగుతున్నట్లనిపించింది. ఇల్లు చేరుకున్నాము.

మేడమెట్లెక్కగానే పైన ఎవరూ కనిపించలేదు. ఉమామహేశ్వరం దేనినో వెదకుతున్నాడు.

మేడ వెనుకభాగాన ఇంద్రాణి నిలబడి టెంకాయ చెట్లగుండా చందమామను చూస్తున్నది.

నాకాళ్ళచప్పుడామెకు వినిపించలేదు.

దగ్గరగావెళ్ళి 'ఇంద్రాణీ!' అన్నాను. ఏదో సమాధిలోనుంచి తెప్పరిలుకున్నట్లు నన్ను కించిదాశ్చర్యంతో చూచింది. ఆమె నవ్విన చిఱునవ్వులో హ్రీరేఖ స్ఫుటంగా కనిపించింది. ఆమె ఏదో మాట్లాడించవలెనని ప్రయత్నం చేస్తున్నది. అయినా పలుకు లేదు. మాటలు చేయవలసినపని కళ్లే చేస్తున్నవి.

గదిలో ఉమామహేశ్వరం వీణ శ్రుతి చేస్తున్నాడు. లోపలికి వెళ్ళినాము. కళ్ళు మూసుకొని ఊరకే తీగలు మీటుతున్నాడు. ఇంద్రాణి అతనికి యెదురుగా ఒకలిప్త ఆగి సన్నగా 'శృంగారలహరి' ఆలపించింది. ఉమామహేశ్వరం కళ్ళు తెరచి ఆమెను చూచి, పాట అందుకున్నాడు. ఆమె పాడటం లేదు. ఇద్దరమూ నిశ్శబ్దంగా కూర్చున్నాము. వీణాక్వాణం నిశ్శబ్దతలో సున్నితమైన 'గిలగిల'లుగా మారి ఒక్క శ్రవణేంద్రియాన్నే కాక సమస్తమునూ ఆవరించుకుంటూంది. మరుక్షణమే ఆ గిలగిలలు కరగిపోయి ఏదో 'జిలుగు'గా మారి తేజస్సుగా అలముకున్నది. అమృతలేపనమై, తర్వాత తర్వాత తత్ ఝరీ స్నాతములైనవి మా శరీరాలు, ఆత్మలూ. చివరి చరణాల్లో అతను స్వరం వేస్తున్నప్పుడుగాని మాకు స్మృతి కలుగలేదు. అతని వ్రేళ్ళు మెట్లమీద ఆకలిగొన్నట్లు చకచక కదలుతున్నవి. ఒక్కొక్క మెట్టుమీద క్షణం ఆగకుండా మరొకదానిపైకి జారుకుంటున్నవి. ఎంత ఒయ్యారం! కుడిచేతి చిటికెన వ్రేలుమాత్రం నిశ్చలంగా తాళానికి మీటు కొడుతున్నది. ఒకచేయి చైతన్యం. రెండవది సంయమనం. అతని వ్రేళ్ళలో ప్రజ్ఞ ఉన్నది! వాయిస్తున్నంతసేపు అతనిలోని 'సిన్సియరిటీ' రెక్కలు గట్టుకొని పైకెగిరివచ్చి అమూర్తంగానే దర్శనమిచ్చినట్లయ్యింది. ఎంత ఆరాటపడినాడో! ఎంత సాధన చేసినాడో ఆ విద్యను. అతడు పాట ముగించినాడు.

కొంచెంసేపటికిగాని మేమెవ్వరమూ మాట్లాడలేదు. తర్వాత ఇంద్రాణి 'తుంగభద్రకు వెళ్ళినారా?' అని అడిగింది. 'ఔ' నన్నాను. ఆమె ఎందుకో నవ్వింది. బహుశా అతడు తుంగభద్రకు వెళ్ళినపుడల్లా అట్లా వాయిస్తూ ఉంటాడేమో? నాకు తెలియదు. అయినా అట్లా అనుకున్నాను.

'కామేశ్వరికూడా వచ్చింది.'

'రేపు నేనుకూడా వస్తాను. తీసుక వెళ్లుతారా?' ఆమె కొంచెం ఆలోచించి అడిగింది.

'తప్పకుండా' నన్నాను. ఆమెకళ్ళల్లో దేనినో అనుసరిస్తున్న ఛాయలు కనిపించినవి. అయితే అవి ఆమె ఆంతరికజీవితానికి సంబంధించినవి.

ఇంతలో పంతులుగారు వచ్చినారు. ఉమామహేశ్వరం క్రిందకు దిగిపోయినాడు. ఇంద్రాణి ఏదో పుస్తకం చదువుకుంటున్నది. పంతులుగారితో కొంచెంసేపు మాట్లాడి శేఖరం ఇంటికి బయలుదేరినాను.

ఇప్పుడెందుకో ఇంద్రాణి కళ్ళల్లో పూర్వపు మెఱుగు లేదు. లేదా అంత మెఱుగు లేదు. ఆ కాంతి ప్రవాహము అంతర్వాహినియైనట్లు అణగి పోయింది. ఇంతకుముందు నేనామెను చూచినపుడామె కండ్లలో ఏమి తళతళలు! అచ్చంగా తుంగభద్ర జాలులోని నీళ్ళవలె ఈషద్వక్రంగా, ఒకచోట వున్న మెరుగు మరొకచోట కనిపిస్తూ వచ్చే ఆదృష్టి, ప్రతిచోట అంతరాల్లోకి చూచే ఆచూపు, ఇపుడెక్కడో ఒకచోట కేంద్రీకరింపబడినట్లు, ఆ కాంతి ప్రవాహమంతా ఆచోటికి చేరుకుంటున్నట్లు అనిపించింది.

రేపు తానూ తుంగభద్రకు వస్తానన్న దెందుకో! రావడంలో విశేషం లేకపోయినా రావాలని వస్తానని ఆమె అనడంలో విశేషం ఉన్నది. ఇంటికి వెళ్ళేటప్పటికి తొమ్మిదయింది.

శేఖరం నాకోసము కాచుకొని ఉన్నాడు. వాళ్ళింకా భోజనాలు చెయ్యలేదు. ముగ్గురం కలిసి భోజనం చేసినాము. 'బాబు' అప్పటికే నిద్రపోయినాడు.

తర్వాత ఉన్నట్లుండి కామేశ్వరి ఒక ప్రశ్న వేసింది.

'అన్నగారూ ఉమామహేశ్వరానికి తుంగభద్రంటే ఎందుకంత ఇష్టమో చెప్పగలరా?'

శేఖరం తాంబూలం నములుతూ నేనేం చెప్తానోనని ఎదురు చూస్తున్నాడు. నేనేమీ మాట్లాడలేదు. కొంచెంసేపాగి కామేశ్వరి—'మీకూ తెలియలేదన్నమాట!' నవ్వుతూ అన్నది.

'శేఖరానికి తెలియకపోవడ మిప్పటికే ఋజువై పోయిందన్నమాట!'

శేఖరం నవ్వినాడు. నిజానికి అతనికి తెలియలేదనడం నాకే బాగాలేదు. అతని చూపులో అంతా తెలిసినట్లే కనిపిస్తున్నాడు.

కాని అతడూ దేనినో వెంటాడుతున్నట్లున్నది.

అణగిపోని ఆ నవ్వుకు మళ్ళీ మెరుగుపెట్టి

'నీకుమాత్రం తెలుసునని నమ్మక మేమిటి' అన్నాడు.

కామేశ్వరి చిఱునవ్వు నవ్వింది. నా కొకటి మాత్రం స్ఫుటంగా కనిపించింది. ఆమె ఇంద్రాణిని మనస్సులో పెట్టుకొని ఉమామహేశ్వరాన్ని గురించి 'రిసర్చి' చేస్తున్నదని.

## 4

ఎండ తీవ్రంగా కాస్తున్నది. ఊళ్లోకి వెళ్ళి నేను వచ్చిన పనేదో కాస్త చూచుకొని వచ్చేసరికి నాలుగున్నరవరకు పైగా అవుతూంది. శేఖరం ఆఫీసు నుంచి రావడానికి ఇంకా కొంతసేపవుతుంది. ఇంటివద్ద వుండడమా మళ్లా వీధిలో పడడమా అని ఆలోచిస్తూ వెళ్ళినాను.

ఇంట్లో ఎవరో కిలకిలా నవ్వుతున్నారు.

ఇంద్రాణి 'బాబు' తో ఆడుకుంటున్నది. కామేశ్వరి కుర్చీలో కూర్చుని వాళ్ళిద్దరిని పరిశీలిస్తున్నది.

నేను వెళ్ళగానే ఇంద్రాణి—

'నేనప్పుడే వచ్చేసినాను.' అన్నది అదే ఉత్సాహంతో.

'మరి ఉమామహేశ్వరమో' చిలిపితనం కనిపించకుండా అడిగినాను.

'వస్తారేమో నాకేం తెలుసు' తలవంచుకొని మెల్లగా అన్నది.

కామేశ్వరి కాఫీ కాచడానికి ఇంట్లోకివెళ్లింది. ఆమె కండ్లలో హాసరేఖ ఇంద్రాణి చూచినట్లు నేను గమనించినాను. బాబు ఇంద్రాణి ఒడిలో కూర్చుని ఆమె చేతిగాజుల వర్ణాలు పరీక్షిస్తున్నాడు. ఆమె ఊరకనే కూర్చున్నది. ఉత్సాహంమాత్రం నిండుగా ఉన్నట్లు కనబడుతున్నది. కదలిస్తే చాలు బయటికి తొణికేటట్లున్నది.

'వెంకటరత్నం కనిపించ డేమింద్రాణీ!' నేనే అడిగినాను.

ఆమె తలయెత్తి చూచింది.

'లేడా'

'మృదంగంమాత్ర మున్నది. ఆయన లేడు.' ఇంద్రాణి నవ్వుతూ అన్నది.

'ఎక్కడికి వెళ్ళినట్టు'

'ఉత్తరాది నెక్కడో ఉన్నాడట.'

వెంకటరత్నం మృదంగపు విద్వాంసుడు. సంగీతంలో అవధానం చేస్తానంటాడు. ఇంద్రాణి అతన్ని ఏడిపించేది. తనతో పందెంవేసికొని పాడి ఒప్పించమనేది.

'అవధాన మేమైంది'

ఆమె ఫక్కున నవ్వి ఏదో అనబోయింది. కాని ఆనవ్వు మరుక్షణంలోనే ఆగిపోయి, పశ్చాత్తాపరేఖ ఒకటి ముఖంలో అలముకున్నది.

మృదంగం బాగా వాయిస్తాడు — నాన్నగారాయన్ని పండితుడంటారు' కొంతసేపటికి అన్నది.

ఐదుంబావవుతూంది—ఇంతలో శేఖరం వచ్చినాడు—'ఏమమ్మా' అంటూ ఇంద్రాణిని సంభావించి, నన్నుచూచి సన్నగా నవ్వి లోపలికి వెళ్ళినాడు.

ఆరు గంటలకల్లా మళ్ళీ అందరమూ తుంగభద్రలో కూర్చున్నాము. గాలి మామూలుగా వీస్తున్నది. నదిలో ఒకచోట తగ్గులో కూర్చోవడంవల్ల ఇసుకతిన్నెలు బాగా 'కాంటూర్సు' తో కనిపిస్తున్నవి. పల్చగా పారుతున్న నీటిపాయవద్ద బాబు కూర్చుని అరచేతితో నీళ్ళమీద తట్టుతున్నాడు. కండ్లలోకి నీళ్ళు చిల్లితే, కండ్లుమూసుకొని తల పైకెత్తి నవ్వుతూ కొడుతున్నాడు. ఇంద్రాణి వాణ్ణి నీళ్ళ దగ్గరనుండి తీసుకవచ్చింది. తర్వాత ఆమె చుట్టుప్రక్కల కలయజూస్తూ కూర్చున్నది. కామేశ్వరి ఇంద్రాణిని చూస్తున్నది. శేఖరం నావైపు చూచినాడు.

'ఒకసారి ఉమామహేశ్వరాన్ని తుంగభద్ర అందం చూచినావా అంటే ఏమందం ఏట్లో అందం. అన్నాడు.'

నామాట వినిపించగానే కామేశ్వరి దృష్టి నామీదకు మరలింది.

'ఉమామహేశ్వరాన్ని నే నప్పటికి కొన్ని రోజులనుండి ఎఱుగుదును. అంతగా మాట్లాడేవాడు కాడు—కోపి అనుకునేవాణ్ణి. ఒకసారి వీధిలో ఎవడో కుర్రవాడు తనని రాచుకొనివెళ్ళితే వాడిని చావగొట్టి వచ్చినాడు. పంతులుగారికీ విషయం తెలిసి ఇతన్ని బాగా చీవాట్లు పెట్టినాడు—'

ఇంద్రాణి ఏదో జ్ఞాపకం చేసుకుంటున్నది. కామేశ్వరి నా మాటలు పరిశీలిస్తున్నది. శేఖరం ఇదంతా తనకి తెలిసినట్లే వింటున్నాడు — రేఖగా ఏదో తృప్తి అతని ముఖంలో కనిపించే కనిపించకుండా దోబూచులాడుతున్నది. మళ్ళా మొదలుపెట్టినాను—

"తర్వాత ఉమామహేశ్వరం ఎందుకో నాతో కూడా తిరిగేవాడు—రెండు మూడు రోజులు గడిచినవి—ఒకరోజు ఇక్కడికే వచ్చినాము.

'నీవు సంగీత మెందుకు నేర్చుకుంటున్నావు?' నేనే అడిగినాను.

తనకు తెలియదన్నాడు.

'ఇంగ్లీషెంగుకు మానివేసినా' వన్నాను—దానికీ అదే సమాధానం.

ఈ రెండు మూడు రోజులనుంచి అతడు సరిగా లేడు—ఈ జబాబులు దాన్ని మరింత స్పష్టంగా చెప్పుతున్నవి. ఒక విధంగా నాకు మొదటినుంచి కొంత చిత్రంగానే కనిపించినాడు—కాస్త లోతుగా కదలించా లనిపించింది.

'తుంగభద్ర అందంగా లేదా?' నేను వర్ణించనక్కరలేదనుకుని ఊరకేవున్నాను. అతడు కలయజూచి తక్షణమే.

'ఏమున్నది—ఏరేగా!' అన్నాడు.

'నీకీ పరిసరాలన్నీ చూస్తే ఏమీ అనిపించదా'

'ఒట్టి ఏరుగానే కనిపిస్తుంది?

నా కాతని కండ్లలో తుంగభద్రలోని యిసుక తిన్నెలే కనిపించినవి. స్రోతస్సు లేదు.

కొంచెం సేపటికి తానే అడిగినాడు—'మీ కందంగా కనిపిస్తుందా?' అని. నేను నవ్వినాను.

'ఏమిటా సొగసు?' అతడు మళ్ళీ ప్రశ్నించినాడు—

'అందం అనేది రకీమని ముట్టుకునేందుకు, పట్టుకునేందుకు, చూపించేందుకు వస్తువుగా దొరకదు. మన దృష్టియొక్క పరిధికి లోబడినవన్ని ఒక సామరస్యంతో ప్రత్యేకమైన ప్రభావాన్ని కలిగిస్తాయి—సహజంగా అది మనల్ని ఆనందపెడుతుంది—కొన్ని చోట్ల దాన్ని చూడడం నేర్చుకోవాలి. ఇప్పటికంటె, ఈ ఏరు నిండుగా పారేటప్పుడు చూస్తే నీ కందంగా కనబడుతుందేమో!'

ఉమామహేశ్వరం కొంచెం ఆలోచించి

'అందం అనేది అక్కడ లేనప్పుడు దాన్ని చూడడమెట్లా—అంటే లేనిదాన్ని కల్పించుకొని భ్రమలో పడమనేనా?'—నన్నెదురుక్కన్నాడు. తానెక్కడ పొరబడినాడో అతడు గ్రహించలేదు—కాని అడుగుతున్న మాట ఎంతో "లాజికల్" గా ఉన్నట్లుంటుంది.

'అది మూర్తరూపంలో కనిపించదు. అందుకే 'వస్తువుగా' దొరకదన్నాను. సౌందర్య మనే ఆ గుణం ఆ పరిధియందంతటా వ్యాపించి వుంటుంది. అది అక్కడ లేదని కాదు...లోకంలో అందరూ అందంగా వున్నదన్నదాన్ని మనమూ అందంగావున్నదంటున్నాము. నిజంగా మన మా అందాన్ని గూర్చి ఆలోచించడం లేదు. క్రొత్తదాన్ని చూచినపుడు కనీసము మన మా దృష్టితో చూస్తేగాని ఎవ్వరికీ ఆ సొగసు బోధపడదు. అందుకే అలవాటుగా చూడని వాటిని చూచినపుడు కొందరు బాగుండనడం మరి కొందరు లేదనడం. ఆదృష్టిని జీవితంలో ప్రత్యేకంగా పెట్టుకున్నవాళ్ళు ఎక్కడైనా సౌందర్య దర్శనం చెయ్యగలరు.'

ఉమామహేశ్వరం ఆలోచనలో పడినాడు. కొన్ని క్షణాలకుగాని అతడు తలయెత్తి చూడలేదు. అతని కండ్లు గాయపడినవాని కండ్లవలె కనిపించినవి. నేననని ఒకమాటను అన్నంతగా అతడు భావించినట్లనిపించింది.

'ఈ దృష్టివుంటే సంగీతం బాగా వస్తుందా.' ఎందుకో అతడీ అసంబద్ధమైన ప్రశ్న అడిగినాడు.

'రానక్కర్లేదు...దీనివల్ల లలిత కళలకు కావలసిన సంస్కారం బాగా ప్రజ్వలిస్తుంది. సంగీతానికి ఎంత సాధన అవసరమో దీనికీ అంతే అవసరము. అలవాటువల్ల హృదయానికి పదును పెట్టుకోవచ్చు. ఐదు నిముషాలు ఇద్దరమూ మాట్లాడలేదు.

'నేను మొద్దువాడిని. నా కొక్కటీ అంటదు' అతడు నిస్పృహతో అన్నాడు. అయినా ఉమామహేశ్వరం అంత 'సెన్సిటివ్' గా వుంటాడని నేననుకోలేదు—ఒక విధంగా నేనే దెబ్బతిన్నవాడివలె ఫీలయినాను. బహుశా నేనా 'రిమార్కు' చెయ్యడమే పొరబాటేమో!

కొద్దిసేపటిలోనే ఉమామహేశ్వరం నవ్వుతున్నాడు. నే నాలోచిస్తున్నాను. నా కర్థం కాలేదు.

‘దీపాలు వెలిగినవి—’ ఉమామహేశ్వరం అన్నాడు.

నేను తలెత్తి చూచినాను—ఉమామహేశ్వరం ఊర్లో అప్పుడే వెలిగిన ఎలెక్ట్రిక్ దీపాలవైపు చూస్తున్నాడు. ఇద్దరమూ లేచి వెళ్ళినాము.

మరురోజంతా ఉమామహేశ్వరం ఏమీ మాట్లాడలేదు నాతో. మూడవరోజు సాయంత్రం తుంగభద్రకు నేనొక్కడనే వచ్చినాను. కొంతసేపు కూర్చొని ఇంటికి వెళ్ళుతూంటె పల్చని వెన్నెట్లో నిన్నటిలాగే, ఉమామహేశ్వరం కనిపించినాడు. నేను పలకరించినాను—అతని కంఠం రుద్ధంగా వినిపించింది. వెన్నెట్లో పైకెత్తిన అతని కళ్ళలో నీళ్ళు తిరిగినవి— నేను కొంచెం కలవరపడినాను—అక్కడే మాట్లాడకుండా కూర్చున్నాను. కొన్ని నిముషాల తర్వాత అతడే లేచినాడు—కలసి ఇంటికివచ్చినాము. కాని తర్వాత నాలుగైదు రోజులూ అతడు మామూలుగానే వున్నాడు. నవ్వుతూ మాట్లాడేవాడు —మళ్ళా వారంరోజుల లోపుగానే నేను మా వూరికి వెళ్ళిపోయినాను—”

కొంచెం ఆగినాను— శేఖరం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఇంద్రాణి ఆలోచించలేదేమో ననిపిస్తున్నది. కామేశ్వరి ముఖంలో అసంతృప్తి కనిపించింది. బాబు ఇసుకలో వెల్లకిలా పండుకొని ఆకాశంలోకి చూస్తున్నాడు.

“—బహుశః అందుకే ఉమామహేశ్వరానికి తుంగభద్ర అంటే అంత ఇష్టం” నేను ముగించినాను.

రాత్రివేసిన ప్రశ్న కిది సమాధానమని కామేశ్వరి గ్రహించింది.

“మీరు చెప్పినవి రెండూ విరుద్ధంగా ఉన్నవి. కార్యకారణాలకు సహజసంబంధం ఉంటుందిగాని అసహజ సంబంధం ఉంటుందా!” కామేశ్వరికి ఇట్లా మాట్లాడడము అలవాటే. దేన్నైనా ‘కాంక్రీట్’గా అడగదు. అబ్‌స్ట్రాక్ట్‌గా మాట్లాడుతుంది. ఇంతకూ నేను చెప్పినది సరైన ‘కారణం’ గా ఆమెకు కనిపించలేదు.

‘పైకి అట్లానే ఉండవచ్చు. ఆ సంబంధం అసహజంగానే ఉందని మన మెట్లా చెప్పడం. దాన్ని సహజంగా మార్చిన కారణమేదైనా ఉంటే, ఆ రహస్య మతనికి తెలియాలి. నాకు తెలిసినంతవరకూ విషయమిది. ఈ సామగ్రితోనే చూస్తే విరుద్ధంగా కనబడవచ్చునేమో. అయినప్పుడు మన కెవ్వరికీ తెలియని రహస్యమేదో ఉండి వుండాలి.”

శేఖరం గడియారంవైపు చూచి ఎనిమిదయ్యిందన్నాడు. ఇంటికి బయలుదేరినాము. ఇంద్రాణిని నేనే ఇంటిదగ్గర వదలడానికి వెళ్ళినాను. దారిలో ఆమె ఏమైనా మాట్లాడుతుందనుకున్నాను. ఆమె ఏమీ అడగలేదు. ఇంటికి వెళ్ళేటప్పటికి పంతులుగారు, ఉమామహేశ్వరం — ఇద్దరే మేడమీద మాట్లాడుతున్నారు. ఉమామహేశ్వరం ముఖంలో మళ్ళీ చిత్రమైన మెఱుపు ఒకటి మెరసింది. పంతులుగారు ‘ఏమోయ్’ అని ఊరకే సంభావించినారు. త్వరలోనే నేను తిరిగివచ్చినాను.

## 5

ఆవేళ ఆదివారం. నేను వచ్చిన పని ఇంకా పూర్తికాలేదు. ఒకటి రెండు రోజులకుగాని అది తెమలేటట్లు కనిపించలేదు. అందుచేత స్వంత పనిని గురించి అంతగా తొందరపడవలసిన అగత్యం కలగలేదు. ఆ మధ్యాహ్నం ఉమామహేశ్వరం కనిపించి నన్నెందుకో ఒకటి రెండు రోజు లాగమన్నాడు. నేనెట్లయినా ఉండకతప్పదు కాబట్టి వెంటనే ‘సరే’ నన్నాను. నాలుగు గంటలకల్లా ఇల్లు చేరుకున్నాను. శెలవుదినము కాబట్టి శేఖరం ఇంట్లోనే ఉన్నాడు. కాని, అనుకోకుండా ఇంద్రాణి అక్కడ కనిపించింది. కామేశ్వరిముఖంలో అణిగి అణిగి మెఱుస్తూ కొంటెనవ్వు కనిపిస్తూంది. ఇంద్రాణి బాబు కాళ్ళకు మువ్వలుకట్టి వాడిని నృత్యం చేయిస్తున్నది. శేఖరం నా ముఖం చూడగానే చిఱునవ్వు నవ్వి, ‘ఏం విశేషా’లంటూ ఒక ఫేముకుర్చీ నావైపు జరిపినాడు. ఏదో అంతా మారినట్టున్నది. ఇంద్రాణి గంభీరంగా కూర్చున్నది. కామేశ్వరి కొంతసేపు ఊరికే వుండి, తర్వాత సీరియస్‌గా నన్నుద్దేశించి ‘దంపతి హస్త’ లక్షణ మడిగింది.

‘ఇంద్రాణికి తెలుసునే’ అన్నాను నేను.

ఆమె నిశితంగా నావైపొకసారి చూచింది. ఏదో అనుమానాన్ని నివృత్తిజేసికొన్నదానివలె తృప్తిపడి, గంభీరంగానే ఎడమచేత శిఖరహస్తము, కుడిచేత మృగశీర్ష హస్తముపట్టి కామేశ్వరివైపు చూచింది.

కామేశ్వరి ఫక్కున నవ్వి ఇంద్రాణి వీపుమీద మెల్లగా చరచి, ఏదో రహస్యం చెప్పింది.

ఇంద్రాణి ముఖం సిగ్గుతో ఎఱ్ఱగలువవలె అయింది. జవాబుగా ఆమె ‘అఖ్ఖర్లేదు’ అన్నది. కాని ఆ రహస్యమేమిటో శేఖరానికిగాని నాకుగాని ఏమీ

అంతుపట్టలేదు. అయినా కామేశ్వరి అంత ఉత్సాహంగా వుండడం నే నెప్పుడూ చూడలేదు.

'మీ ఉమామహేశ్వరం రాలేదే మన్నగారూ'

కామేశ్వరి వేసిన ఈ ప్రశ్న నన్ను మరింత చకితుణ్ణి చేసింది. అతడు 'మా' ఉమామహేశ్వరం ఎందుకైనాడో—అందులోనూ అప్పుడే—నా కర్థం కాలేదు. శేఖరం మాత్రం ఎందుకో ఈ సన్నివేశంలో నన్నొంటరిగానే వదలి తాను ఊరికే గమనిస్తూ కూర్చున్నాడు.

కొన్ని క్షణాలుండి, కామేశ్వరి లేస్తూ పల్చని నవ్వుతో—

'ఉమామహేశ్వరం ఒప్పుకున్నాడట!' అని ఇంద్రాణి ముఖంలోకి చూచి లోపలికి వెళ్ళింది. ఆమె పరిహాసంలో కంటె, ఇప్పటి ఆమె పల్చని నవ్వులో నే ఎక్కువ ఆనందం కనపడింది.

ఇంద్రాణి ఆమె వెంటనే తానుకూడా లోపలి గదిలోకి వెళ్ళింది.

మువ్వలు చప్పుడు చేస్తూ బాబు 'పిన్ని' దగ్గరికి పోయినాడు.

ఆమె అప్పుడే పెళ్ళికూతు రయిపోయింది! లోపలినుండి మువ్వల చప్పిడితోబాటు ఇంద్రాణి నవ్వు కిలకిలమని వినిపించిది. ఉమామహేశ్వరం ఓడిపోయినాడు.

"చిరాదంతశ్శల్యం దహన కృత మున్మీలితవతా
తులాకోటి క్వాణైః కిలికిలిత మీశాన రిపుణా."

అన్న సౌందర్యలహరి శ్లోక చరణములు జ్ఞప్తికి వచ్చినవి.

ఇంద్రాణి ఇంకా అక్కడ వుండగానే ఉమామహేశ్వగం ఎక్కడనుంచో వచ్చినాడు. ఇంద్రాణిలో కొంత తడబాటు, ముఖంలో ఒక అందమైన మార్పు కనిపించింది. అతడు మాత్రం ఆమెను గమనించనట్టే వున్నాడు. గమనించక పోవడంవల్లనే తాను పట్టుబడుతున్నానని అతనికి తెలియదు పాపం!

కొంతసేపైనాక మేము ముగ్గరమే షికారు బయలుదేరినాము—నదిలో బాగా మధ్యకు వెళ్ళి కూర్చున్నాము.

'మీరు రేపంతా ఉంటారా?' ఉమామహేశ్వరం అడిగినాడు నన్ను.

'వీలైతే రేపే వెళ్ళుదామనుకుంటున్నాను. ఉదయం గాని ఏదీ నిర్ధారణగా తెలియదు. తర్వాత బెంగుళూరు వెళ్ళాలి.'

కొన్ని క్షణాలు గడచినవి.

'దూరంగా మన మెవ్వరికీ తెలియని దేశంలో ఎవరిచేత గుర్తింపబడకుండా వుంటే!—చిత్రంగా ఉంటుంది.' శేఖరం అన్నాడు.

ఆతని మనస్సు చేస్తున్న అడ్వెంచర్ ఇది.

'ఎక్కడికి వెళ్ళినా ఏదో ఒక డిగ్రీలో మనల్ని గుర్తిస్తారు. అంతగా 'రికగ్నిషన్' అఖ్ఖర్లేదనుకుంటే అడవుల్లో అజ్ఞాతవాసం చేయవలసిందే' నే నన్నాను. శేఖరం చిన్నగా నవ్వినాడు.

ఉమామహేశ్వరంలో పూర్వపు మెఱుపు ఒకసారి మెఱసి' చలించినట్టు కనిపించినాడు. కొంచెం వుండి స్తిమితపడిన చూపుతో అన్నాడు.

"అదికూడా ఉపయోగంలేదు. అడవుల్లో ఎవరూ లేకపోతే నిన్ను నీవే 'రికగ్నైజు' చేసుకోవడం జరుగుతుంది. మనం బ్రతుకుతున్నామన డానికి ఇతరుల సాక్ష్యం,—ఎవరూ లేకపోతే తనకు తన సాక్ష్యమైనా—ఎందుకో!"

ఈ మాటలు చాల లోతునుంచి వచ్చినట్లు ధ్వనించినవి. అతనిలో చట్టున వచ్చిన మార్పునుబట్టి నాకు కొంత అనుమానం కలిగింది. అతడా మార్పును దాచుకో ప్రయత్నించలేదు. ఉమామహేశ్వరం అన్నాడు—

'నేను ఆరునెలలపాటు ఒంటరిగా నల్లమలల్లో తిరిగినాను. నే నిక్కడ వుండగా నా కొక చెంచు వాడితో పరిచయం. ప్రతిసంవత్సరం వచ్చేవాడు. ఒకసారి వాడితోగూడా వెళ్ళి అడవుల్లో మకాం పెట్టినాను. వాళ్ళ గూడేనికి అరమైలు దూరంలో నాకొక ఆవాసం—ఎత్తైన మంచెమీద గుడిసె తయారుచేసి యిచ్చినాడు. ఆహారపదార్థాలు, తేనె, చారపప్పు తెచ్చియిచ్చేవాడు. ఒక్కొక్కసారి ఒకటి రెండు రోజులు వాడికి కనిపించేవాణ్ణి కాదు. మామూలుగా రోజూ ఇష్టం వచ్చినంతసేపూ తిరగటం, మంచెమీద ఉండటమే పని."

కొంచెం ఆగి మళ్ళా అందుకున్నాడు.

"ఎంత ప్రశాంతంగా ఉంటుందని! ఆకాశాన్నంటే చెట్లతో ఎక్కడ చూచినా, పచ్చగా, అరణ్యం తక్కిన ప్రపంచాన్ని మనకు మూసివేసి వేరే లోకాన్ని సృష్టిస్తుంది....అంత సౌందర్యాన్ని

ఒక్కసారి చూడడం గూడా సాధ్యంకాదు. అదీ ఘడియ ఘడియకూ మారినట్లు కనిపిస్తూంటుంది. పగలు కనిపించే తీరు వేరు—రాత్రి కనిపించే తీరు వేరు... భయమౌతుంది. అందంలోనూ భయం ఉంటుందనీ, భయంలో గూడ అందం ఉంటుందని నా కప్పుడే అర్థమైంది. 'భయద సుందరం' అని పుస్తకాల్లో చదివి ఏమిటో అనుకునేవాడిని."

అతడు ఈ కొద్ది క్షణాల్లో బాగా కదలిపోయినట్లు కనిపించినాడు.

మళ్ళా చెప్పుక పోతున్నాడు—

"ఆ అరణ్య ప్రకృతినీ, చెంచువాళ్ళనీ ఒకే దృష్టితోనే చూచేవాడిని. ప్రకృతికీ వాళ్ళకూ నా దృష్టిలో తేడాలేదు. కాని నన్ను నేను ప్రత్యేకంగా 'రికగ్నైజు' చేసుకునేవాడిని. ఏ కొద్దిక్షణాలో తప్ప ఆ అభేదం ప్రకృతితో నాకు సిద్ధించలేదు. బహుశా మనలో పెరిగి పాతుకపోయిన నాగరికతా ప్రభావం కావచ్చు! కాదంటే కొన్ని సామ్యాలు మాత్రం కనిపించేవి."

కొద్దిసేపు ఏదో ఆలోచనలో పడి తేరుకుని అన్నాడు.

"అందాన్ని గూడా ఒక పరిమాణంలోనే చూడాలి. ఆ 'మెజర్' ఆ వ్యక్తి సౌందర్య దృష్టిపైన, దాన్ని సమాకర్షించి అనుభవించగల నిలుకడ మీద ఆధారపడుతుంది. నావంటి వాడికి ఒక్కసారి కనువిప్పు కలిగి అత్యావేశంతో దృక్ప్రసారానికి లోబడినంతమట్టుకు సౌందర్యాన్ని ఒకసారిచూస్తే 'డిస్టార్షన్' కలుగుతుంది. అది మైల్డ్ డిస్టార్షనే కావచ్చు. ఏమైనా నా అనుభవం అది." అతడు ఆగినాడు. ఏదో మామూలు విషయాన్ని చెప్పినట్టుగానే అవిశేషంగా దాన్ని ముగించినాడు.

అత డొక్కసారిగ తన రహస్యాన్ని, అనుభవాన్ని బయటపెట్టే వేళకు మే మిద్దరమూ ఆశ్చర్యపడినమాట నిజమే. ఇంతకూ అత డంత ఇంపల్సివ్ గా ఆ పనిచేయడం మరింత చిత్రంగానే కనిపించినా కారణాన్ని వెదకడ మనవసరమనిపించింది. ఇంతలో శేఖరం ప్రశ్న వేసినాడు.

'అడవులు ఎంతమంది చూడలేదు. అందరికీ మీరు చెప్పిన 'డిస్టార్షన్' కలుగుతూందా?'

'అదికాదు—మీరు స్వీకరించే సౌందర్య పరిమాణం మీకు తెలుసు. తెలిసి చూస్తున్నారు. తెలియక నేను దెబ్బతిన్నాను. మామూలుగా తెలిసి చూచేవాళ్ళకు మీరు, మీ భార్యకాని, ఇంద్రాణిగాని ఉదాహరణం కావచ్చు.

"మీకా 'డిస్టార్షన్' వల్ల ఏమయిందంటారు.?" నేను ప్రశ్నించినాను. అతడు కొంచెం ఆలోచించి అన్నాడు.

"నిత్యజీవితంలో ఎంత సౌందర్య దృష్టి గలవాడికైనా సౌందర్యం అనేది *abundant* గ దొరికే వస్తువుకాదు. పరిమిత పరిమాణంలోనే లభ్యమవుతుంది. అందుచేత అంతే చూడగలిగినవాళ్లకు లోకంతో సుఖమైన సమన్వయం కుదురుతుంది. ఇతరుల కట్లా కుదురదు."

ఇంతలో గాలి బలమైంది. దూరాన్నుంచి నల్లటి మేఘాలు కొట్టుకవస్తున్నవి. ముగ్గురమూ ఇంటికి నడిచినాము.

దారిలో పెండ్లి ప్రస్తావన తెచ్చి ఉమామహేశ్వరాన్ని శేఖరం అభినందించినాడు. నేనూ కన్గ్రాచులేట్ చేసినాను. అతడు నన్ను వివాహానికి తప్పక రావాలన్నాడు. ఆతనిలో ఉత్సాహం ప్రస్ఫుటంగా కనిపించింది. మమ్మల్ని ఇంటివద్ద వదలి అతడు ఉదయాన్నే కలుసుకుంటా నంటూ వెళ్ళినాడు. ఇంద్రాణి అప్పటికే ఇంటికి వెళ్ళింది.

రాత్రి మేఘాలు పట్టి ఎక్కడనుంచో వచ్చి కుంభవర్షం కురిసింది. తెల్లవారే వేళకు తుంగభద్ర పారుతూంది. పైనకూడా ఎక్కడో పెద్దవర్షం కురిసివుండాలి. నా మనస్సు చాలా ఉత్సాహంగా ఉంది. శేఖరాన్ని పిలుచుకొని నదిగట్టుకు వెళ్ళినాను. మేము కూర్చున్న స్థలాలేవీ కనిపించలేదు. ఎంత అందంగా పారుతూందని! ఎంత నిండుగా పారుతూందని!! నాకు చప్పట్లు చరచి గిర్రున తిరగాలనిపించింది. అరగంటదాకా అక్కడనుండి కదల బుద్ధి వెయ్యలేదు.

తిరిగివస్తూ శేఖరం నాతో ముందురోజు కామేశ్వరికి ఇంద్రాణికి మధ్య జరిగిన 'రహస్యం' చెప్పినాడు. 'దంపతిహస్తము' పట్టినతర్వాత 'మన్మథహస్తము' పట్టమని కామేశ్వరి అడిగిందట. ఆఅమ్మాయి సిగ్గుపడి అక్ఖర్లేదన్నదట! ఈ విషయం తర్వాత కామేశ్వరి శేఖరానికి చెప్పిందట.

అతడు నడుస్తూ నా ముఖంలోకి చూచినాడు. అతనికా అమ్మాయి జవాబు అర్థమైనట్లు కనిపించలేదు.

'నిజమే. అక్కర్లేదు. దంపతిహస్తంలో ఎడమ చేత చూపే శిఖరహస్తమే మన్మథునికి చెల్లుతుంది. ఆమె సరిగానే చెప్పింది' అన్నాను.

శేఖరంముఖంలో నవ్వు సాగడానికి ఒక క్షణం పట్టింది.

"నాకు తెలిసినట్టే వుంటుంది. తెలియదు. లేదా తెలిసినా చెప్పలేను. నాకుమాత్రమే తెలిసిన ట్లుంటుంది. ఉమామహేశ్వరం నిన్న చెప్పిందంతా నాకు తెలుసు, ఒకవిధంగా. కాని అతడు చెప్పిందాకా తెలియదు!" అతడు అదోరకంగా నవ్వినాడు.

బజార్లో నాకు కావలసిన వ్యక్తి ఎదురై వ్యవహారం విషయం తేల్చి చెప్పినాడు. దానితో బెంగుళూరు ప్రయాణం స్థిరపడింది.

వెంటనే పంతులుగారింటికివెళ్ళి ఊరికి వెళ్ళుతున్నానని చెప్పినాను. ఇంద్రాణి పెండ్లికిరమ్మని తండ్రి ద్వారా మరీమరీచెప్పించింది. ఆ అమ్మాయికి తల్లిలేదు. ఆ లోటంతా యిప్పుడు కనిపించిందామె.ముఖంలో. ఉమామహేశ్వం నావెంట శేఖరమింటికి వచ్చినాడు. కామేశ్వరి అతన్ని ఆప్యాయంగా పలుకరించింది. నేను నవ్వుకున్నాను.

బస్సుస్టాండుకు శేఖరం, ఉమామహేశ్వరం— ఇద్దరూ వచ్చినారు. నా కాపూరు వదలిపో బుద్ధి పుట్టలేదు. నిజానికి తుంగభద్రను, వీళ్ళనూ వదల బుద్ధి వెయ్యలేదు. మా జీవితాల్లో తుంగభద్ర ఎంతగా అతుక్కుపోయిందో! ఉమామహేశ్వరం కండ్లలో తుంగభద్ర నీళ్ళలోని మెఱుపు కనిపించింది. వాళ్ళిద్దరూ చిఱునవ్వు నవ్వుతున్నారు. బస్సు కదిలింది.

తుంగభద్ర పారుతూంది.

జనసందోహం బురదలోనే నడుస్తూంది.

